క్లుప్తంగా

గడ్డి ట్రాక్టర్ ట్రక్కు బోల్తా



కొల్లూరు : వరిగడ్డి లోడ్‌తో వెళుతున్న ట్రాక్టర్ అదుపు కోల్పోయి ఓ పక్కకు బోల్తా కొట్టిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. మండలంలోని దోనేపూడి వైపు నుంచి ట్రాక్టర్‌లో కరకట్ట మీదుగా వరి గడ్డిని తరలిస్తున్నారు. కొల్లూరు పశ్చిమ బ్యాంక్ కెనాల్ వద్ద పెసర్లంక వైపునకు ట్రాక్టర్‌ను తిప్పి కరకట్ట దింపేందుకు ప్రయత్నిస్తుండగా వరిగడ్డితో ఉన్న ట్రాక్టర్ ట్రక్కు పల్లపు ప్రాంతం వైపుకు జారి పక్కకు పల్టీ కొట్టింది. ప్రమాద సమయంలో ట్రక్కు నుంచి ట్రాక్టర్ ఇంజిన్ విడివడటంతో డ్రైవర్ పెనుప్రమాదం నుంచి తృటిలో తప్పించుకోగలిగాడు.

అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధం



కొల్లూరు : అగ్ని ప్రమాదం చోటు చేసుకొని ఓ పూరిల్లు దగ్ధమైన ఘటన మండలంలోని పెసర్లంకలో చోటుచేసుకుంది. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. ఆదివారం సాయంత్రం స్థానిక నాంచారమ్మ ఆలయం ఎదురుగా ఉన్న సోమరౌతు వెంకటేశ్వరరావుకు చెందిన పూరింటి నుంచి అకస్మాత్తుగా మంటలు రావడం ప్రారంభించాయి. సమీపంలో ఉన్న స్థానికులు ప్రమాదాన్ని గుర్తించి గృహంలో ఉన్న వారిని అప్రమత్తం చేయడంతో ప్రాణాలు చేతబట్టుకొని కట్టుబట్టలతో బయటపడ్డారు. మంటల తీవ్రత అంతకంతకూ పెరిగిపోవడంతో గృహం పూర్తిగా అగ్నికి ఆహుతవడంతో గృహంలోని సామాగ్రి మొత్తం మంటల్లో కాలి బూడిదయ్యాయి. స్థానికులు మంటలను అదుపుచేసేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. సుమారు రూ.2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించినట్లు బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది. అగ్ని ప్రమాదానికి గల కారణాలు వెల్లడికాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం చోటుచేసుకొని ఉండవచ్చునని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

సేంద్రియ ఎరువులతోనే నాణ్యమైన దిగుబడులు



రేపల్లె: రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచితే భూసారం పెరగటంతో పాటు నాణ్యతా విలువలతో కూడిన దిగుబడులు సాధించవచ్చని శ్రీబయో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, మైక్రో బయాలజీ శాస్త్రవేత్త డాక్టర్ కేఆర్‌కే రెడ్డి అన్నారు. శ్రీబయో ఎస్టేటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో మైక్రో బయోమ్ ఆధారిత బయో ఫెర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ సహకారంతో శనివారం రాత్రి మండలంలోని నల్లూరుపాలెంలో మట్టే ప్రధానం అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పునరుత్పాదక వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన పెంచేందుకు సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు భూమిలో సారాన్ని పెంచటం ముఖ్యమన్నారు. దీనికై రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి, పశువుల వ్యర్థాలు, హరిత ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విస్తరణ విభాగ అధిపతి డాక్టర్ ఎం.సురేష్‌కుమార్, సంస్థ వైస్ ప్రెసిడెంట్ వై.మల్లికార్జునరావు, జోనల్ మేనేజర్ రామారావు, పలు ఫెర్టిలైజర్స్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా కైలాసగౌరి వ్రతం



తెనాలి: స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీదుర్గాపార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మశ్రీ కొండూరి శృంగేరి, జ్యోతి దంపతులచే 'కైలాసగౌరి వ్రతం' వైభవంగా నిర్వహించారు. 114 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ దేవాలయంలో కొన్ని వేల కైలాసగౌరి నోములు జరిగాయి. స్త్రీలు తమ సౌభాగ్యం, దీర్ఘసుమంగళిత్వం కోసం ఈ వ్రతాన్ని చేస్తారు. దీనిలో ఇచ్చినవారు, పుచ్చుకొన్నవారు ఇద్దరూ అమ్మ కృపకు పాత్రులై సమస్త సౌభాగ్యాలు పొందుతారని ప్రతీతి. నోములో భాగంగా ముత్తయిదువులను అమ్మ స్వరూపంగా భావించి, అయిదు కుంచాల పసుపు, అయిదు కుంచాల కుంకుమను తమ దోసిళ్లతో పంచిపెడతారు. కార్యక్రమాన్ని వైదిక విధానంలో ఆచరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ముత్తయిదువులు పాల్గొన్నారు.

వీరి కష్టాలు తీరేదెన్నడో..?

- దయనీయంగా కొండుబోట్లవారిపాలెం గిరిజన కాలనీవాసుల దుస్థితి
- విషసర్పాల మధ్య సహజీవనం
- పాముకాటుకు గురవుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు



నాగరాజు కాలువకట్టపై ఎస్టీలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు

బాపట్లటౌన్: ఊరుతో సంబంధం లేదు.. పోనీ తాగునీరు అయినా ఉండదు.. అంగడికెళ్లి సరుకులు తెచ్చుకోలేరు.. కనీసం జ్వరమొచ్చినా మందుబిళ్లల కోసం కిలోమీటర్ల మేర వెళ్లాలి. అసలు వాళ్ల పిల్లలకు చదువంటే ఏంటో తెలియదు.. వాళ్లకు తెలిసిందల్లా ఒక్కటే పొలాల గట్ల వెంట తిరిగి ఎలుకలు, కాలువల వెంట తిరిగి చేపలు పట్టుకోవడం వాటిని అమ్ముకుని వచ్చిన సొమ్ముతో గంజి తాగటం. ఇది వాళ్ల దినచర్య. మండలంలోని కొండుబోట్లవారిపాలెం శివారులోని నాగరాజు కాలువ కట్టపై నివసించే ఎస్టీ కాలనీ వాసుల దుస్థితి దయనీయంగా ఉంది.

భయంతో జీవనం

చిన్న చిన్న వెదురుబొంగులతో నిర్మించుకున్న కొద్దిపాటి గుడిసెలు ఇటీవల వీచిన ఈదురు గాలులకు నేలకూలాయి. ఇంటిపై కప్పిన పరదాలు, తాటి ఆకులు కొట్టుకుపోయాయి. దీనికి తోడు కాలువకట్ట అంతా తుమ్మచెట్లు, పొదలతో నిండి ఉండటంతో పాములు, తేళ్లు, మండ్రగప్పల తాకిడి ఎక్కువగా ఉంటుంది. గతంలో పాము కరిచి గున్నం రత్నాలు, నక్కా కృష్ణారావులు మృతి చెందారు. దీనికి తోడు పిల్లలు ప్రమాదవశాత్తూ జారి కాలువలో పడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలూ లేకపోలేదు. గతంలో కాలువలో పడి మల్లేశ్వరి అనే మూడేళ్ల పాప చనిపోయింది. గుడిసెలు ఖాళీ చేయలేక, ప్రత్యామ్నాయ మార్గాలు లేక క్షణం.. క్షణం భయంతో జీవిస్తున్నారు.

కాలనీవైపు చూడని అధికారులు

సుమారు గత 15 సంవత్సరాలుగా 100 కుటుంబాలకు చెందిన ఎస్టీలు కొండుబోట్లవారిపాలెం శివారులోని నాగరాజు కాలువ కట్టపై గుడిసెలు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారు. వారికి కనీస వసతులైన తాగునీరు, పక్కా గృహాలు కల్పించాల్సిన అధికారులు కాలనీ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాతల సహకారంతో నిర్మించుకున్న చేతి పంపు నుంచి వస్తున్న ఉప్పునీరే వారికి తాగునీరు. కాలనీవాసులకు జ్వరమొచ్చినా, వాంతులు, విరేచనాలు అయిన కనీసం వైద్య పరీక్షలు నిర్వహించే వాళ్లు కూడా లేరు. నివాస గృహాల చుట్టూ చిల్లచెట్లు విపరీతంగా పెరిగి ఉండటంతో విషసర్పాలకు నిలయంగా మారింది. కాలనీలో విద్యుత్ సౌకర్యం ఊసే లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీవాసుల సమస్యలు పరిష్కారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



చేతి పంపు వద్ద బారులు తీరిన కాలనీ వాసులు

ఎన్నికలకు ముందు ప్రస్తుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ కాలనీకు వచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రెండు ఎకరాల భూమి కొనుగోలు చేసి పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేసి పక్కా గృహాలు నిర్మిస్తామన్నారు. ఎన్నికలై ఏడాది గడిచినా కనీసం కాలనీవైపు తొంగి చూడలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జగనన్న లేఅవుట్‌లో కాలనీకు చెందిన 35 మందికి పట్టాలు అందజేశారు. మిగిలిన వారికి ఇవ్వాల్సి ఉంది.

ఎన్నికలప్పుడే గుర్తుకు వస్తాం



ఎన్నికల సమయంలో తప్ప మేము ఉన్నామని ఏ నాయకుడికి గుర్తుకు రాము. గెలిచాక అవి చేస్తాం.. ఇవి చేస్తాం అంటూ చెప్పిన ఎమ్మెల్యే ఏడాదైనా ఒక్కరోజు కూడా మా కాలనీకి రాలేదు. నిత్యం సమస్యలతో అల్లాడిపోతున్నాం. మా బాధలు చెప్పుకుందామని రెండు సార్లు కార్యాలయానికి వెళితే అక్కడా మా బాధలు చెప్పుకునే అవకాశం రాలేదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి మా సమస్యలు పరిష్కరించాలి.

– బండి మల్లేశ్వరి

ఏడాదిగా మంచంలోనే



ఏం జరిగిందో ఏమో తెలియదు. కాళ్లు, చేతులు చచ్చుబడిపోయి, ఏడాది నుంచి మంచంలోనే నరకం అనుభవిస్తున్నాను. నాకు భార్య దీపిక, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో కూలీ పనులకు పోయి కుటుంబాన్ని పోషించేవాడిని. మంచంలోనే ఉంటున్నా కనీసం పెన్షన్ కూడా అందించడం లేదు. నరకయాతన అనుభవిస్తున్నాను. నా లాంటి దుర్భర జీవితం ఏ ఒక్కరికీ రాకూడదు.

– నంబూరి శేషయ్య

పాము కాటుతో నరకం



నన్ను మా కాలనీలో ఒకేసారి రెండు తాచుపాములు కరిచాయి. రెండు నెలల పాటు నరకం అనుభవించాను. అసలు బతుకుతాననుకోలేదు. అందిన కాడల్లా అప్పులు చేసి నన్ను మా తల్లిదండ్రులు బతికించారు. గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించుకున్నాను. నన్నే కాదు. ఈ కాలనీలో ముగ్గురు, నలుగురిని పాములు కరిచాయి. గత్యంతరం లేక ఇక్కడే జీవనం సాగిస్తున్నాం.

– కోనేటి లక్ష్మయ్య

ఆధార్ కార్డు కూడా లేదు



నాకు వివాహం జరిగి ఐదేళ్లు అవుతుంది. కనీసం ఆధార్ కార్డు కూడా లేదు. అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ప్రయోజనం లేదు. ఆధార్ కార్డు లేకపోవడం వలన ప్రభుత్వం అందించే ఏ ఒక్క పథకం నాకు రావడంలేదు. కనీసం పేదలకు పంపిణీ చేసే బియ్యానికి కూడా నోచుకోలేకపోతున్నాను.

– అద్దూరి నాంచారమ్మ

రేషన్ కోసం నిరీక్షణ



కొల్లూరు జెండాచెట్టు సమీపంలో రేషన్ దుకాణం వద్ద లబ్ధిదారుల నిరీక్షణ

కొల్లూరు : నిత్యావసర సరుకులు ఇంటి వద్దకే పంపిణీ విధానాన్ని ప్రవేశపెట్టి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులను కష్టాల నుంచి గట్టెక్కిస్తే, కూటమి ప్రభుత్వం తిరిగి రేషన్ దుకాణాల వద్దే నిత్యావసర సరుకుల పంపిణీ విధానాన్ని అమలు చేసి రేషన్ కార్డుదారులను కష్టాల కొలిమిలోకి నెట్టిందన్న అభిప్రాయం ప్రజలలో వ్యక్తమవుతుంది. ప్రతి నెల ఎండీఎం వాహనాల ద్వారా రేషన్ సరుకులను ఇంటి వద్దనే అందజేస్తుండటంతో ఇబ్బందులు లేకుండా సరుకులు పొందిన లబ్ధిదారులు, ప్రస్తుత కూటమి ప్రభుత్వ విధానం వల్ల రేషన్ దుకాణాల వద్ద గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి తలెత్తింది. ఆదివారం రేషన్ దుకాణాల వద్ద నిత్యావసర సరుకుల పంపిణీ విధానం ప్రారంభమైన నేపథ్యంలో పలు రేషన్ దుకాణాల వద్ద లబ్ధిదారులు అరుగులు, చెట్ల నీడన అధిక సమయం నిరీక్షించాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో లబ్ధిదారులు నిరాశ, నిస్పృహలకు గురయ్యారు.



కొల్లూరు గౌడపాలెంలో రేషన్ దుకాణం వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

రేపల్లె: ఛత్రపతి శివాజీ స్ఫూర్తిగా హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ కోరారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కమిటీ సమావేశం ఆదివారం పట్టణ 1వ వార్డులోని శ్రీరామ్‌నగర్ రామ మందిరంలో జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన సత్యనారాయణ మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానములు, సమరసత సేవా ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో గ్రామాలలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 11వ తేదీన ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుతూ దేవాలయాల్లో అఖండ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న ఏకాదశి నగర సంకీర్తనలు జరుపుకోవాలన్నారు. నెల రోజులపాటు సభ్యులు చేయాల్సిన కార్యక్రమాలను చర్చించారు. సమావేశంలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు జంజనం హేమశంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, చింతల మురళీకృష్ణ, నంబూరు వేణు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ

కూలిన కాలిబాట వంతెన

రేపల్లె: గంగడిపాలెం గ్రామంలో కాలిబాట వంతెన ఆకస్మికంగా కూలిపోయింది. సుమారు 30 సంవత్సరాల క్రితం బ్యాంక్ కెనాల్‌పై నిర్మించిన ఈ కాలిబాట వంతెన పైనుంచే రైతులు పొలాలకుగానీ, చెరువులకుగానీ వెళ్తుంటారు. సముద్రంపై వేటకు వెళ్లాలన్నా, ఎవరైనా మృతి చెందితే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లాలన్నా ఈ కాలిబాట వంతెనే ప్రధాన ఆధారం. బ్యాంక్ కెనాల్‌లో సాగునీటి పారుదల ఉన్న సమయంలో ఈ వంతెన పైనుంచి పొలాలకు, చెరువులకు, ఇతర అవసరాలకు రాకపోకలు సుగమంగా ఉండేది. వంతెన నిర్మించి సంవత్సరాలు గడవటంతో బలహీనమైన వంతెనపై కొంత భాగం పెచ్చులూడి ఒక మీటరు మేరకు కూలిపోయింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవటంతో పెనుప్రమాదం తప్పింది. దీంతో ఆ వంతెనపై నుంచి రాకపోకలు చేయాలంటే ఇబ్బందులు తప్పటం లేదని ఆ ప్రాంత ప్రజలు వాపోతున్నారు. పాలకులు, అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో నూతన వంతెన నిర్మాణం చేపట్టాలని, అప్పటి వరకు ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు నిర్వహించి వాడుకలోకి తీసుకురావాలని ప్రజలు ముఖ్యంగా రైతులు కోరుతున్నారు.



కూలిన కాలిబాట వంతెన

నంది అవార్డుల ప్రస్తావన రాకపోవడం దురదృష్టకరం

సినీ దర్శకుడు దిలీప్‌రాజా



బాపట్లటౌన్: తెలంగాణ ప్రభుత్వం ప్రజాగాయకుడు గద్దర్ పేరుతో సినిమాలకు అవార్డులను ప్రకటించినప్పటికీ ఆంధ్రాలో నంది అవార్డుల ప్రస్తావన రాకపోవడం దురదృష్టకరమని మా ఏపీ (మూవీ ఆర్టిస్టుల అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్) వ్యవస్థాపకులు, సినీదర్శకుడు దిలీప్ రాజా అన్నారు. పట్టణంలోని పటేల్ నగర్ సాయి గ్రాండ్ కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన అదనపు ఎస్పీ విఠలేశ్వర్ పదవీ విరమణ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ 2014 నుంచి 2024 వరకు ఆంధ్రప్రదేశ్‌లో నిలిచిపోయిన నంది అవార్డులను ప్రకటించడానికి విధి విధానాల అమలులో అలసత్వం తగదన్నారు. తెలంగాణ ప్రభుత్వం జయసుధ జ్యూరీ చైర్మన్‌గా మురళీమోహన్ మరో కమిటీకి చైర్మన్‌గా ఇప్పటి వరకు నిలిచిపోయిన అవార్డులను ప్రకటించి సినీ పరిశ్రమలో పదేళ్లగా నెలకొన్న నిశ్శబ్దానికి తెరదించారన్నారు. రాజకీయాలకు అతీతంగా తక్షణమే ఆంధ్రాలో జ్యూరీని నియమించవలసిందిగా ఆయన ప్రభుత్వానికి మనవి చేస్తున్నానన్నారు. సినీ రంగానికి విశిష్ట సేవలందించిన ఎన్టీఆర్, అక్కినేని నాగేశ్వరరావు, కృష్ణ, శోభన్ బాబు, రామానాయుడు, దాసరి నారాయణరావు, కె.విశ్వనాథ్‌ల పేరిట ప్రత్యేక అవార్డులను సినీ ప్రముఖులకు అందజేయాలని ప్రతిపాదిస్తున్నామన్నారు. తద్వారా మరణించిన సినిమా పెద్దలకు ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వం సముచిత గౌరవం ఇచ్చినట్లవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. అవార్డుల ఎంపికలో రాజకీయ ప్రమేయం ఉండకూడదన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, సినిమాటోగ్రఫీ మంత్రులను స్వయంగా కలిసి అభ్యర్థిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రేపల్లె: ఇసుకపల్లిలోని 11 కేవీ ఫీడర్, పోటుమెరకలోని సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో సోమవారం ఉదయం 8 నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్‌బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రేపల్లె పట్టణంలోని బస్టాండ్ నుంచి ఇసుకపల్లి వరకు కుడివైపు, జేఎల్‌బీ కళాశాల రహదారిలో విద్యుత్ నిలుపుదల చేయబడునన్నారు. అదేవిధంగా మండలంలోని బేతపూడి, ఉయ్యూరువారిపాలెం, పోటుమెరక గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

చెరుకుపల్లి: కావూరు సబ్ స్టేషన్ పరిధిలో చెరుకుపల్లి 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ ఎస్.సురేష్ బాబు ఒక ప్రకటనలో ఆదివారం తెలిపారు. మండలంలోని చెరుకుపల్లి, కావూరు, ఆరుంబాక, ఏమినేనివారి పాలెం గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని సురేష్‌బాబు కోరారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చెయ్యాలి

ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

కర్లపాలెం: కార్డుదారులందరికీ రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చెయ్యాలని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ చెప్పారు. ఆదివారం పేరలి గ్రామంలోని రేషన్ షాపును ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ప్రారంభించి కార్డుదారులకు బియ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికలాంగులకు, వృద్ధులకు రేషన్ వారి ఇళ్ల వద్దకే తీసుకువెళ్లి అందించటం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ సుందరమ్మ, సివిల్ సప్లయిస్ డీటీ ఫణికుమార్, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు వై.భూపతిరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. పిట్టలవానిపాలెం మండల పరిధిలోని ఖాజీపాలెం గ్రామంలో ఉన్న రేషన్ షాపులు ఎమ్మెల్యే నరేంద్రవర్మ ప్రారంభించి కార్డుదారులకు బియ్యం అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, సివిల్ సప్లయిస్ డీటీ ఫణికుమార్, ఆర్ఐ కె.శ్రీను, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు తదితరులు ఉన్నారు.



పేరలిలో మహిళకు బియ్యం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

రేషన్ బియ్యం మాఫియా కోసమే షాపులు

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఏడుకొండలు



కర్లపాలెం: రేషన్ బియ్యం మాఫియా కోసమే కూటమి ప్రభుత్వం రేషన్ షాపులను పునరుద్ధరిస్తుందని వైఎస్సార్‌సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రజల సౌకర్యం కోసం అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వాహనాల ద్వారా కార్డుదారుల ఇళ్లకే రేషన్ సరుకులు పంపిణీ చేశారని ఏడుకొండలు గుర్తుచేశారు. ఎండీయూ వాహనాలతో బియ్యం పంపిణీ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేయటంతో అనేక మంది ఉపాధి కోల్పోయారని వారికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తుందని తెలిపారు. దూరప్రాంతాల వారు రేషన్ షాపుల నుంచి బియ్యం తమ ఇళ్లకు మోసుకువెళ్లటం వలన అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. రేషన్ కోసం షాపుల వద్ద గంటలు గంటలు ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలి

కర్లపాలెం: మోటారు వాహనాలపై ప్రయాణించే వారు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర చెప్పారు. ఆదివారం మండల కేంద్రం కర్లపాలెంలోని జాతీయ రహదారిపై ఎస్ఐ తమ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ద్విచక్ర మోటారు వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్ పెట్టుకోవాలని, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించాలని అన్నారు. ఆటోలలో పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించవద్దని పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని ఆటో డ్రైవర్లకు, ప్యాసింజర్లకు అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన లైసెన్సు, ధ్రువీకరణ పత్రాలన్నీ వాహనంలో ఉంచుకోవాలని ఎస్ఐ చెప్పారు.

రెడ్డిపాలెంలో...

పిట్టలవానిపాలెం మండల పరిధిలోని రెడ్డిపాలెం టోల్‌గేట్ సమీపంలో చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ధ్రువీకరణ పత్రాలు సరిగా లేని వాహనాలను గుర్తించి యజమానులకు అపరాధ రుసుము విధించారు. తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



కర్లపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రవీంద్ర

మలేరియాపై అప్రమత్తత అవసరం

తెనాలిలో ప్రారంభమైన మలేరియా నివారణ మాసోత్సవం

తెనాలిఅర్బన్: మలేరియా వ్యాధి పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని నందులపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్మోడియం అనే పరాన్నజీవి వలన మలేరియా వ్యాధి వస్తుందని తెలిపారు. ఒకరి నుంచి మరొకరికి ఇది వ్యాపించే అవకాశం ఉందన్నారు. జ్వరం, వణుకు, చలి, చెమటలు పట్టడం, ఒంటినొప్పులు, తదితర లక్షణాలు దీనికి ఉంటాయన్నారు. రక్త పరీక్ష ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చన్నారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతుంటే వెంటనే వైద్యశాలలో చూయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా మందులు ఇస్తున్నట్లు చెప్పారు. తెనాలి పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంత ఉమాకాంత్ మాట్లాడుతూ ఆదివారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. 2027వ సంవత్సరానికి ఒక్క మలేరియా కేసు కూడా లేకుండా ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. 2030 నాటికి మలేరియా రహిత భారతదేశంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ఈ లక్ష్యాల సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ మంచినీటితో దోమలు గుడ్లు పెట్టి తద్వారా దోమల ఉత్పత్తిని పెంచుకుంటాయని తెలిపారు. ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దీపాల శ్రీనివాసరావు, బండారు మల్లేశ్వరరావు, దాసరి నాగమల్లేశ్వరరావు, షేక్ రషీద్, సయ్యద్ కరిముల్లా, సంకా శరత్‌బాబు, ఎ.వేణు గోపాలరావు, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రియాంక

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

తెనాలి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక, గుంటూరు కమిటీ ఆధ్వర్యంలో కొల్లిపర మండలం వల్లభాపురం గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి–ఇందూజ్ఞాన వేదిక గుంటూరు కమిటీ అధ్యక్షుడు రౌతు శ్రీనివాసరావు, సభ్యులు కృష్ణారావు, రామకృష్ణ, శ్రీను, శివలింగం నాయక్, బ్రహ్మం, శ్రీను, రామోజీనాయక్, శివ, దిల్షా పాల్గొన్నారు.

మిద్దె సాగుదారులకు విత్తనాల పంపిణీ



తెనాలిరూరల్: పట్టణంలో మిద్దెలపై సాగు చేస్తున్న వారికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్స్ గ్రూపు సభ్యులు విత్తనాలను ఆదివారం ఉచితంగా పంపిణీ చేశారు. తోటకూర, పాలకూర, బచ్చలికూర వంటి ఆకుకూరలు, వంగ, బీర, బెండ, సొర, కాకర, బీన్స్, చిక్కుడు కాయగూరల విత్తనాలతో పాటు పూల మొక్కల అంట్లను సుమారు 100 మందికి ఉచితంగా అందజేశారు. సూర్యదేవర కృష్ణదేవ్, ప్రభంజన్, రాధిక, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.